# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 12 । జనవరి । 2024






**కిలో టమాట రూ.16**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.



**క్రీడా సంబరం.. సాంస్కృతిక వైభవం**

పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో గురువారం సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సమ్మేళనం ఘనంగా జరిగింది. విద్యార్థులు సాహసక్రీడలతో అబ్బురపరిచారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.9°/ 17.6°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### నేడు మడకశిరలో మెగా జాబ్‌మేళా

**మడకశిర:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు శుక్రవారం పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. మేళాలో 13 కంపెనీలు పాల్గొంటాయని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ఎస్.అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉమ్మడి అనంతపురం జిల్లా, బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ. 10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని వెల్లడించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటా తదితర వాటిని తీసుకురావాలని సూచించారు.

### అమరావతి ఎక్స్‌ప్రెస్ పొడిగింపు



**గుంతకల్లు:** హుబ్లీ–విజయవాడ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపూర్ వరకూ పొడిగించినట్లు డివిజన్ కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం జోనల్ వ్యాప్తంగా మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను పొడిగించి శుక్రవారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. అందులో భాగంగా విజయవాడ–హుబ్లీ (వయా గుంతకల్లు) మధ్య నడిచే (17255/26 నంబర్లుతో) ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి నర్సాపూర్ వరకూ నడవనుంది. నర్సాపూర్ జంక్షన్‌లో (17255) రోజూ సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.20 గంటలకు హుబ్లీ జంక్షన్‌కు చేరుకోనుంది. ఇదే రైలు (17226) హుబ్లీ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు.

### 16న నృసింహుని పార్వేట ఉత్సవం

**కదిరి:** ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి పార్వేట ఉత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా సంక్రాంతి పండుగ మరుసటి దినం కనుమ రోజున ఖాద్రీశుని పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో 16వ తేదీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం నిత్య పూజల అనంతరం స్వామివారు 9 గంటల్లోపు కదిరి కొండకు చేరుకుంటారని, అక్కడ మధ్యాహ్నం 2 గంటల వరకూ స్వామి వారికి పూజలు, నివేదనలు నిర్వహిస్తారని తెలిపారు. అక్కడ నుంచి స్వామివారు నేరుగా పాల పొంగుల మండపం చేరుకొని పాలు ఆరగించి, భక్తులకు కాసేపు దర్శనమిస్తారని ఈఓ వెల్లడించారు. తర్వాత రైల్వే స్టేషన్ వద్ద పార్వేట ఉత్సవం జరుగుతుందన్నారు.

# టీడీపీలో టికెట్ల గోల!

- ప్రతి నియోజకవర్గంలోనూ రెండు వర్గాలు
- ఎవరికి వారు తమకే టికెట్ అంటూ ప్రకటనలు
- టికెట్ ఇవ్వకపోతే వ్యతిరేకంగా పనిచేస్తామంటూ హెచ్చరికలు
- ఇంట్లో ఒకరికే టికెట్ అన్న బాబు వ్యాఖ్యలపై రుసరుస
- అది తనకూ వర్తిస్తుందని చంద్రబాబు గుర్తించాలంటున్న తమ్ముళ్లు



**కదిరి:** తెలుగుదేశం పార్టీలో టికెట్ల గోల ముదురుతోంది. చంద్రబాబు నాన్చుడి ధోరణి, అవకాశవాద రాజకీయంతో ప్రతి నియోజకవర్గంలోనూ రెండు గ్రూపులను తయారు చేశారు. ఎప్పటికప్పుడు మీకే నా మద్దతంటూ పార్టీ కార్యక్రమాలకు భారీగా ఖర్చు చేయిస్తూ ఇన్నాళ్లూ నెట్టుకొచ్చారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్‌పై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ గ్రూపు రాజకీయం నడుస్తోంది. కొందరు చంద్రబాబు తమకు టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారంటుంటే.. మరికొందరు తమకు చినబాబు లోకేష్ అండ ఉందంటూ స్వపక్షంపై పోరుకు సిద్ధమయ్యారు. దీంతో పార్టీ శ్రేణులు డైలమాలో పడ్డాయి.

- కదిరిలో కందికుంట వెంకట ప్రసాద్‌కే టికెట్ ఇస్తున్నట్లు చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆయనపై నకిలీ డీడీల కేసు ఉన్నందున కందికుంట భార్య యశోదమ్మ పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు ఈసారి కదిరి టికెట్ తనదేనని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ధీమాగా చెబుతున్నారు. అదే జరిగితే ప్లాన్–బీ రెడీగా ఉందని కందికుంట వర్గం హెచ్చరిస్తోంది. ఇంకోవైపు బీజేపీ కూడా ఈ సీటుపై కన్నేసింది. టీడీపీతో పొత్తు ఖరారైతే కదిరి టికెట్ బీజేపీదేనని వారంటున్నారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి టికెట్‌పై ధీమాగా ఉన్నారు. అయితే ఆయనపై సొంతపార్టీలోని బీసీ నాయకులు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. పల్లెకు టికెట్ ఇస్తే ఓడించడం ఖాయమని వారు హెచ్చరిస్తున్నారు. దీంతో పార్టీ అధిష్టానం పుట్టపర్తి నుంచి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పను దించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే తామంతా పార్టీని వీడటం ఖాయమని 'పల్లె' వర్గం హెచ్చరిస్తోంది.
- పెనుకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, సవితమ్మల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. దీంతో అధిష్టానం బీకే పార్థసారథిని హిందూపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేయించాలని ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే హిందూపురం ఎంపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కూడా పోటీ పడుతున్నారు. ఈక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే టికెట్ బీకే పార్థసారథికే ఇవ్వాలని ఆయన వర్గం డిమాండ్ చేస్తోంది. అయితే టీడీపీ పెద్దల మేరకే నాలుగేళ్లుగా నియోజకవర్గంలో తిరుగుతూ ఎంతో ఖర్చు చేసుకున్నానని, పార్టీ కార్యక్రమాలు చేశానని, అందువల్ల పెనుకొండ టికెట్ తనకే ఇవ్వాలని సవితమ్మ అధిష్టానంపై ఒత్తిడి తెస్తోంది.
- ధర్మవరం టికెట్ విషయంలో పరిటాల శ్రీరామ్, వరదాపురం సూరీల మధ్య పోరు సాగుతోంది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున ధర్మవరం నుంచి బరిలో దిగి కేతిరెడ్డి చేతిలో ఘోర పరాభవం చవిచూసిన వరదాపురం సూరి... కొన్నిరోజులకే బీజేపీలో చేరి తన కాంట్రాక్టు పనులు చేసుకుంటున్నారు. దీంతో నాలుగేళ్లుగా ధర్మవరం బాధ్యతలను పరిటాల శ్రీరామ్ చూస్తున్నారు. అయితే సూరి ఇప్పుడు మళ్లీ పచ్చ చొక్కా తొడుక్కొని ప్రెస్‌మీట్‌లు పెట్టి టీడీపీ టికెట్ తనకే అని ప్రకటిస్తున్నారు. దీంతో ఇక్కడ టీడీపీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. మరోవైపు జనసేన కూడా ధర్మవరం ఎమ్మెల్యే టికెట్‌పై పట్టుబడుతోంది. పొత్తులో భాగంగా ఈ టికెట్ తమదేనని జనసేన నాయకులు చెబుతున్నారు.
- మడకశిర ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం కావడంతో ఇక్కడ టీడీపీ తరఫున ఈరన్న టికెట్ ఆశిస్తున్నారు. ఈయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని గుండుమల తిప్పేస్వామి వర్గం హెచ్చరిస్తోంది. గుండుమల సూచించిన అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని కోరుతోంది. అలా కాదని ఈరన్నకే ఇస్తే మూకుమ్మడి రాజీనామాలు ఖాయమని వారంటున్నారు. మరోవైపు గుండుమల సూచించిన వ్యక్తికి టికెట్ ఇస్తే తామేంటో చూపిస్తామని ఈరన్న వర్గం చెబుతోంది.
- రాప్తాడు నియోజకవర్గం నుంచి ప్రస్తుతానికి పరిటాల సునీత ఒక్కరే రేసులో ఉన్నప్పటికీ ఇంట్లో ఒకరికే టికెట్ అన్న చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో ధర్మవరంపై ఆశ పెట్టుకున్న పరిటాల శ్రీరామ్ తప్పనిసరి పరిస్థితుల్లో రాప్తాడుకు మారాల్సిన పరిస్థితి. అయితే తాను ధర్మవరం నుంచే పోటీ చేస్తానని ఇప్పటికే శ్రీరాం పలు మార్లు చెప్పారు. ఈ క్రమంలో ఇంట్లో ఒకరికే టికెట్ అనే నిబంధన చంద్రబాబుకు వర్తించదా? అని రాప్తాడు నేతలు ప్రశ్నిస్తున్నారు.
- హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే టికెట్‌పైనా గందరగోళం నెలకొంది. నందమూరి, నారా కుటుంబాల నుంచి ఎవరో ఒకరు దిగే పరిస్థితి కనిపిస్తోంది. అయితే తాము ఇంకెన్నాళ్లు పల్లకీ మోయాలంటూ స్థానిక టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇంట్లో ఒకరికే టికెట్ అనే చంద్రబాబు వ్యాఖ్యలను ఇక్కడ కూడా కొందరు సొంత పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు. 'ఇంట్లో ఒకరికే ' నిబంధన చంద్రబాబు ఇంటి నుంచే ప్రారంభిస్తే మంచిదంటున్నారు.

**ఏదీ సామాజిక న్యాయం..**

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటిస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఆ విషయాన్ని పక్కనబెట్టారని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. చంద్రబాబు తన సొంత సామాజిక వర్గానికే సగం సీట్లు కేటాయిస్తే టీడీపీకి బీసీలు, ముస్లింలు ఓట్లెలా వేస్తారని వారంటున్నారు. మరోవైపు పార్టీలో ఎంత సీనియారిటీ ఉన్నా... ఇంట్లో ఒకరికే టికెట్ ఇస్తామని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సైతం ఆ పార్టీ నాయకులు కొందరు తప్పుబడుతున్నారు. ఇది మీకు వర్తించదా? అని వారు చంద్రబాబును ప్రశ్నిస్తున్నారు. మీ ఇంట్లో మీకు, మీ కొడుకు లోకేష్‌కు, మీ బావమరిది బాలకృష్ణకు టికెట్లు ఇస్తున్నారు కదా? అని గుర్తు చేస్తున్నారు. దీనికి తోడు చంద్రబాబు ఈసారి రెండు చోట్ల పోటీ చేస్తున్నారనే మాటలను సైతం వారు గుర్తు చేస్తూ.. మా బాబుకు ఓటమి భయం పట్టుకుందంటున్నారు.

### నేడు సామాజిక సమతా సంకల్ప సదస్సు

**పుట్టపర్తి అర్బన్:** సీఎం వైఎస్ జగన్ ఈనెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా శుక్రవారం సామాజిక సమతా సంకల్ప జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నారాయణ పాఠశాల సీజ్




నారాయణ పాఠశాలను సీజ్ చేస్తున్న డీఈఓ మీనాక్షి

**కదిరి అర్బన్:** నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) మీనాక్షి సీజ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం డీఈఓ మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే నారాయణ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. డీఈఓ వెంట ఎంఈఓ చెన్నకృష్ణ ఉన్నారు.

### విధుల్లోకి 'సమగ్ర' ఉద్యోగులు

**పుట్టపర్తి:** న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడంతో సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం వారు బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయ పర్యవేక్షకుడు జగదీష్‌కు సమ్మె విరమణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి వెంకటేష్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

- సంక్షేమ పథకాలతో పేదలకు మేలు
- అన్ని వర్గాలనూ మోసగించిన చంద్రబాబును నమ్మొద్దు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు, ప్రజలు



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**లేపాక్షి:** దేశంలోనే ఎక్కడా లేని విధంగా మహిళలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ సమన్వయకర్తలు జె.శాంతమ్మ, దీపికతో కలిసి గురువారం మండలంలోని కోడిపల్లి, చోళసముద్రం, బిసలమానేపల్లి, నాయనిపల్లి, కల్లూరు, కొండూరు గ్రామాల్లో నిర్వహించిన 'పల్లెబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో మంత్రి మాట్లాడారు. మహిళలకు పెద్ద సంఖ్యలో సీట్లు కట్టబెట్టి చట్ట సభల్లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవించామన్నారు. అధికారం కోసం చంద్రబాబు అలవిగాని హామీలను ఇచ్చి మోసగించారని విమర్శించారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మొండి చేయి చూపారన్నారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే 'నాడు–నేడు' పథకంతో పాఠశాల భవనాలను కార్పొరేట్ భవనాలకు దీటుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. 'అమ్మ ఒడి' పథకంతో ఆదుకున్నారని ఏ తల్లిని అడిగినా చెబుతారన్నారు. తమ పార్టీ అసెంబ్లీ, పార్లమెంటు సమన్వయకర్తలు దీపిక, శాంతమ్మను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అవకాశమిస్తే స్థానికంగా ఉంటూ ప్రతి గడపకూ తిరిగి సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

**బాలకృష్ణను ఇంటికి పంపిస్తాం..**

ఎన్నికలప్పుడు ఆర్భాటాలు చేస్తూ, గెలవగానే నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని బాలకృష్ణను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపుతామని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ తెలిపారు. రెండు సార్లు కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై పెద్ద మెజార్టీతో ఆయన గెలవలేదన్నారు. వైఎస్సార్ సీపీ కంటే 5 శాతం ఓట్లు ఎక్కువ వచ్చాయని గుర్తు చేశారు. ఏడాదికి ఒకసారి వచ్చే మేకప్ బాలకృష్ణ కావాలో, స్థానికంగా ఉండే వారు కావాలో ప్రజలే ఆలోచించాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరున ఆ పార్టీ నాయకులు కోట్ల రూపాయలు దోచుకున్నారని దుయ్యబట్టారు. జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, మరోసారి ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం, చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్లు బోయ గిరిజమ్మ, శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, పార్టీ పరిశీలకులు రెడ్డీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మధుమతిరెడ్డి, రెడ్డి జేసీసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి, సర్పంచ్‌లు వసుంధర, నాగేంద్రబాబు, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యులు భాగ్యమ్మ, అశ్వత్తప్ప, నాయకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

- జిల్లాలో 10,295 మందికి రూ.10.89 కోట్ల లబ్ధి
- వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద 11,798 ఖాతాల్లో రూ.28.46 లక్షల జమ
- కలెక్టర్ అరుణ్‌బాబు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు

**పుట్టపర్తి అర్బన్:** చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి 'జగనన్న తోడు' పథకం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'జగనన్న తోడు' కింద అర్హులైన 22,093 మంది లబ్ధిదారులకు రూ.11.178 కోట్ల మెగా చెక్కును ఆయన అందజేశారు. సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సును అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా డీఎం రాములు, చిరు వ్యాపారులతో కలిసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. 'జగనన్న తోడు' కింద వరుసగా నాలుగో ఏడాది 8వ విడతగా రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 1,029 మంది, హిందూపురం–1,066 మంది, కదిరి– 2,793,మడకశిర–2,057, పెనుకొండ–1,117, పుట్టపర్తి– 3,124, రాప్తాడు– 612 మంది మొత్తం 10,295 మంది కొత్తగా రుణ సౌకర్యం పొందారన్నారు. వారికి రూ.10.89 కోట్లు అందజేసినట్లు చెప్పారు. దీంతో పాటు జిల్లాలో వడ్డీ రీఇంబర్స్‌మెంట్ కింద 11,798 మందికి రూ.28.46 లక్షలు అందిందన్నారు.

**గతంలో పేదలను ఆదుకోలేదు..**

గత ప్రభుత్వాలు పేదలను ఆదుకున్న పాపాన పోలేదని అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి పేర్కొన్నారు. విలేకరులతో వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ నాయకులు వడ్డీ వ్యాపారాలు చేస్తూ చిరువ్యాపారుల జీవితాలను చిన్నాభిన్నం చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కాల్ మనీ కేసులు ఎన్నో బయట పడ్డాయని గుర్తు చేశారు. వ్యాపారుల కష్టాలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ 'జగనన్న తోడు' పథకాన్ని ప్రారంభించారన్నారు. వడ్డీ వ్యాపారులపై ఆధార పడకుండా ఆదాయాలను మెరుగుపరుచుకోవడానికి రూ.10 వేలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

'జగనన్న తోడు' అమలు ఇలా..

| విడత | లబ్ధిదారులు | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1వ విడత | 9,995 | 9.99 |
| 2వ విడత | 10,851 | 10.85 |
| 3వ విడత | 11,042 | 11.04 |
| 4వ విడత | 9,842 | 9.82 |
| 5వ విడత | 10,485 | 10.18 |
| 6వ విడత | 5,596 | 11.63 |
| 7వ విడత | 13,549 | 14.59 |
| 8వ విడత | 10,295 | 10.89 |
| మొత్తం | 81,655 | 88.99 |

### చిరువ్యాపారులకు గౌరవం



'జగనన్న తోడు' పథకం ద్వారా చిరు వ్యాపారులకు సీఎం వైఎస్ జగన్ గౌరవం కల్పించారు. వడ్డీ బాధలు తప్పించారు. ఇప్పటి వరకూ 2 సార్లు లబ్ధి పొందా. నా చీరల వ్యాపారానికి నగదు ఎంతో ఉపయోగపడుతుంది. వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంతో పిల్లలను చదివించుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– వెంకటలక్ష్మీ, ఎనుములపల్లి

### సీఎంకు రుణపడి ఉంటాం



నాలుగో సారి రుణం తీసుకుంటున్నా. సకాలంలో కంతులు చెల్లించిన వెంటనే వడ్డీ మొత్తం నా ఖాతాలో జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం మా లాంటివారికి ఎంతో మేలు చేస్తుంది. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా.

– కళావతమ్మ, జానికంపల్లి, బుక్కపట్నం మండలం

### వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వడ్డీ వ్యాపారుల వేధింపులే లేవు. సంతోషంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం. మాలాంటి చిరు వ్యాపారులకు గతంలో ఏ ప్రభుత్వమూ చేయూతనివ్వలేదు. సీఎం వైఎస్ జగన్ మా కుటుంబానికి ఆసరా, చేయూత, ఆరోగ్య శ్రీ పథకాలతో లబ్ధి చేకూర్చారు.

– సిద్దగంగమ్మ, చిన్నగుడ్డంపల్లి, హిందూపురం

# పకడ్బందీగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- కలెక్టర్ అరుణ్‌బాబు

**పుట్టపర్తి అర్బన్:** ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడటం ఎన్నికల అధికారుల బాధ్యతని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు జిల్లా, అసెంబ్లీ స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్షలో పాల్గొన్నారు.

**ప్రతి అంశంపై అవగాహన అవసరం..**

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపైనా అవగాహన ఉండాలన్నారు. వాటి కోసం నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై ప్రజలకు విశ్వాసం కలిగేలా స్వీప్ కార్యక్రమంలో అవగాహన పెంచాలన్నారు.

**సిబ్బంది నియామకానికి చర్యలు..**

ఎన్నికల నిర్వహణకు జిల్లాకు అవసరమైన 12 వేల మంది సిబ్బందిని నియమించడానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు నియోజకవర్గంలోని పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. బ్యాలెట్ యూనిట్స్ 180 సెక్టార్లుగా విభజించి 16 మంది జిల్లా అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించామన్నారు. జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ఏ జిల్లాలో పని చేసినా ఎన్నికల సమయంలో విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. క్లెయిముల పరిష్కారంలో జిల్లా అధికారుల సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించామన్నారు.

**1,561 పోలింగ్ కేంద్రాలు..**

జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ర్యాంప్‌లు లేని వాటిలో ర్యాంప్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు ఓటు వేసేందుకు అవసరమైన రవాణ, కేంద్రాల్లోకి సులభంగా ప్రవేశించడానికి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి 10 మంది మాస్టర్ ట్రైనర్లు ఉంటారని వారి ద్వారా నియోజకవర్గాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


నాగరాజు (ఫైల్)

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరు సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వృద్ధుడు చనిపోగా..మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివారాలమేరకు... గుట్టూరు గ్రామానికి చెందిన బోయ నాగరాజు (62) తన భార్య కేశమ్మతో కలసి పొలం వద్దకు బయలు దేరారు. అయితే ఆంజనేయస్వామి దేవా లయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని ఢీ కొన్నాడు. ఈ ఘటనలో నాగరాజు అక్కడికక్కడే చనిపోయాడు. కేశమ్మ తీవ్రంగా గాయపడగా అనంతపురం తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో గురువారం ఓ మహిళ అనుమానా స్పదస్థితిలో మృతి చెందింది. కుమ్మర రత్నమ్మ (45) అనే మహిళపై స్థలం విషయంలో కుటుంబ సభ్యులు గొడవపడి దాడి చేయడం తో చనిపోయిందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే గుండెపోటుతో చనిపోయిందని మరికొందరు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ వలీబాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ మృతికి కార ణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# క్రీడా సంబరం.. సాంస్కృతిక వైభవం

- ఘనంగా సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సమ్మేళనం
- సాహస క్రీడలతో అబ్బురపరచిన విద్యార్థులు
- భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు


రామాయణ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు


అగ్నికీలల నుంచి బైక్ రైడింగ్ చేస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు, సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలు.. వెరసి సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం ఘనం గా జరిగింది. గురువారం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ మైదానం ప్రేక్షకులతో కిక్కిరిసింది. ఉదయం 8 గంటలకు ప్రశాంతి నిలయంలోని యజుర్ మం దిరం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని విద్యార్థులు వేదపఠనం, బ్రాస్ బ్యాండ్ నడుమ ప్రత్యేకంగా అలంకరించిన కారుపై ఊరేగింపుగా హిల్‌వ్యూ స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనం తరం విద్యా సంస్థల వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా సమ్మేళనం ప్రారంభించారు.

**ఆకట్టుకున్న విన్యాసాలు..**

క్రీడా సమ్మేళనంలో ప్రశాంతి నిలయం, ముద్దేనహ ళ్లి, బృందావన్ క్యాంపస్‌ల విద్యార్థులు ప్రదర్శ నలతో ఆకట్టుకున్నారు. సింహనృత్యం, బంగీజం ప్, కత్తిసాము, కర్రసాము, జిమ్నాస్టిక్, స్కేటింగ్, జంపింగ్, కరాటేలతో అబ్బురపరిచారు. గుజరాత్, తమిళనాడు, కేరళ సంస్కృతీ సంప్రదాయాలు, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబిం బిస్తూ నృత్య ప్రదర్శన చేశారు. ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు నిర్వహించిన బైక్ రైడింగ్ అమితంగా ఆకట్టుకుంది. బైక్ జంపింగ్, అగ్నికీలల నుంచి బైక్ నడుపుతూ చేసిన విన్యాసాలు ఒళ్లు గగు ర్పొడిచాయి. సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో సత్యసాయి ప్రైమరీ పాఠశాల, ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, అనంతపురం క్యాంపస్, వైట్‌ఫీల్డ్‌లోని సత్యసాయి నర్సింగ్ అనుబంధ విభా గాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అల రించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాగానంద, మనోహన్ శెట్టి, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఉపా ధ్యాక్షుడు నిమిష్ పాండ్య, వివిధ రాష్ట్రాలకు చెం దిన 25 మంది ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.


పాల్గొన్న ఆర్‌జే రత్నాకర్, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు


బైక్ రైడింగ్ సాహస విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


విద్యార్థినుల మార్చ్‌ఫాస్ట్



## ఎదురు కాళ్లతో అడ్డం తిరిగిన బిడ్డ

- సజావుగా కాన్పు చేసిన వైద్యాధికారి


క్షేమంగా ఉన్న బిడ్డను చూపుతున్న వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు గురువారం అరుదైన కాన్పు చేశారు. ఎదురు కాళ్లతో బిడ్డ అడ్డం తిరగ్గా వైద్యా ధికారులు సజావుగా కాన్పు చేశారు. వైద్యాధికారుల వివరాల మేరకు.... తాడిమర్రి బీసీ కాలనీకి చెందిన శివదత్త కుమారి అనే గర్భిణీ నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో కాన్పు కోసం స్థానిక పీహెచ్‌సీకి వచ్చారు. దీం తో డాక్టర్ గోవర్ధన్‌నాయుడు ఆమెను పరీక్షించగా బిడ్డ అడ్డం తిరిగినట్లు గుర్తించారు. గర్భిణీ కుటుంబ సభ్యు లకు ధైర్యం చెప్పి.. సాధారణ కాన్పు చేయగా 3.5 కిలోల మగబిడ్డ జన్మించాడు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ వైద్యాధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వే సమస్యలు పరిష్కరించండి

- డీఆర్‌ఎంకు విజ్ఞప్తి చేసిన డీఆర్‌సీసీ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి


డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు నెలకొన్న రైల్వే పరమైన సమస్యలను పరి ష్కరించాలని డీఆర్‌సీసీ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పొడిగించిన రేణిగుంట - నంద్యాల డెమో రైలుకు అన్ని రైల్వేస్టేషన్లలో స్టాపిం గ్ కల్పించాలన్నారు. కరోనా ముందు రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లల్లో ఆగుతున్న హరిప్రియా ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఓబుళవారిపల్లి రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపేలా చర్యలు తీసుకోవా లన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, ఓబుళవారిపల్లి అండర్ బ్రిడ్జి పనులు వేగవంత చేయలన్నారు. అర్జీలు అందజేసిన దివ్యాంగులకు వెంటనే రైల్వే పాస్‌లు మంజూరు చేయాలన్నారు.

## అసైన్‌మెంట్ కమిటీలో న్యాయం చేయండి


జేసీకి సమస్య విన్నవిస్తున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల కొలతలు వేసి వన్‌బీ, స్కెచ్ సైతం ఇచ్చిన అసైన్ మెంట్ భూములకు సంబంధించి అసైన్‌మెంట్ కమిటీలో ఉంచి రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతులు జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, పుట్టపర్తి అర్బన్ పరిశీలకులు రమ ణారెడ్డితో కలిసి వెంగళమ్మచెరువు, వీరాంజనేయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు జేసీని కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... రెండు గ్రామాల్లో 50 మందికి పైగా రైతులు చాలా కాలం గా భూములను సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం అర్హులైన రైతులకు అసైన్‌మెంట్ భూములకు సాగు హక్కులు కల్పించిం దన్నారు. అయితే తమ గ్రామాలకు చెందిన భూములను సర్వేయర్లు కొలతలు వేసి ఆన్‌లైన్‌లో ఉంచడంతో స్కెచ్, వన్‌బీ వచ్చాయన్నారు. అయితే వాటిని కమిటీలో ఉంచకపోవడంతో సాగు హక్కులు కల్పించడా నికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సమస్య విన్న జేసీ అభిషేక్‌కుమార్ తహసీల్దార్‌కు చెప్పి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు దారా శంకర్, నరేష్, కేశవ, ఆకుల రవి తదితరులు ఉన్నారు.

# అదృశ్యమైన వ్యక్తి కుళ్లిన శవంగా...

- కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు


కుళ్లిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ పృథ్వీతేజ్, సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: మండల పరిధిలోని మద్దిలేరు వంక సమీ పంలో నాగారెడ్డిపల్లి చెందిన పాపిరెడ్డి (60) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. నెల రోజుల క్రితం పాపిరెడ్డి అదృశ్యమయ్యాడు. ఈ నేపథ్యంలో వంక సమీపంలో కుళ్లిన శవాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు చెప్పారు. పరిశీలించిన పోలీసులు పాపిరెడ్డి మృతదేహంగా గుర్తించారు. పాపిరెడ్డి నెల రోజుల క్రితం నుంచి కనిపించడం లేదని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు కూడా చేయలేదని పోలీసులు చెబు తున్నారు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ పృథ్వీ తేజ్, ముదిగుబ్బ సీఐ యతీంద్ర పరిశీలించారు. మృ తిపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో హత్యా? ఆత్మహత్యా అనే కోణంలో విచారణ చేపట్టారు.

## యువకుడి ఆత్మహత్య


సతీష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాలతో యువ కుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగర పం చాయతీ పరిధిలోని ఇస్లాపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... ఇస్లాపురంకు చెందిన గొల్ల సతీష్ (24)కు అతని బంధువులకు మధ్య కొంతకాలంగా భూ తగా దాలు నడుస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకపో వడంతో గొల్ల సతీష్ జీవితంపై విరక్తి చెంది బుధ వారం క్రిమిసంహారక మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహు టిన అనంతపురం తర లించారు. అయితే చికిత్స పొందుతూ సతీష్ మృతి చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులు ఉన్నారు.

# భక్తుల కొంగు బంగారం

- 14వ తేదీ నుంచి అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు
- 16న బ్రహ్మ రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


అంత్య సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్

పావగడ: కర్ణాటక రాష్ట్రం అనం తపురం జిల్లా సరిహద్దు నాగలమడక గ్రామంలో ఉన్న అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధి కారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 16న స్వామి వారి బ్రహ్మ రథోత్సవం జరుగనుంది.

**ఇసుకలో దొరికాడు... ఇల వేల్పు అయ్యాడు**

పూర్వం నాగలమడక గ్రామంలో అన్నంభట్లు అనే బ్రాహ్మణోత్తముడుం డేవాడు. ఆయన కుక్కె ఆలయం నుంచి ఇక్కడకు వచ్చి చేరుకున్నాడు. అయితే సుబ్రహ్మణ్యస్వామి అతని కలలో వచ్చి తాను ఏడు పడగల సర్పాకారంలో పక్కనే ఉన్న పెన్నా నదిలో దాగి ఉన్నానని.. తనను వెలికి తీసి పెన్నా ఒడ్డున ప్రతిష్టించాలని కోరారట. ఆ మరుసటి రోజే అన్నం భట్లు ఏటిలోని ఇసుకను నాగలితో దున్నగా ఏడు పడగల సర్పాకార శిల నాగలి చాలుకు దొరికింది. అప్పటి నుంచి ఆ గ్రామానికి నాగలమడకగా పేరు వచ్చింది. ఆ ఉద్భవ మూర్తిని ఏటి ఒడ్డున చిన్న బండల గుడి కట్టి ప్రతిష్టించాడు. అనంతరం కొన్నాళ్లకు సమీపంలోని ఆంధ్రకు చెందిన రొద్దం గ్రామం నుంచి వ్యాపారి సుబ్బయ్య శెట్టి ఎద్దుల బండిలో వ్యాపార నిమిత్తం బళ్లారికి వెళ్తూ నదీ తీరాన విశ్రమించాడు. తన వ్యాపారం లాభసాటిగా జరిగితే స్వామికి ఆలయం కట్టిస్తానని మొక్కు కున్నాడు. మొక్కు నెరవేరగా సుబ్బయ్యశెట్టి స్వామి వారికి ఆలయం కట్టించాడు. అప్పటి నుంచి నేటి వరకు సుబ్బయ్యశెట్టి వారసులే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్నారు. ఇసుకలో దొరికిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నేడు ఎంతో మంది భక్తులకు ఇలవేల్పుగా మారాడు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రసాదంగా పెసర పులగం, వంకాయ బజ్జి వంటలను వండుకుని ఆరగించే సంప్రదాయాన్ని నేటికీ పాటిస్తుం డటం విశేషం.

**14 నుంచి బ్రహ్మోత్సవాలు..**

అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్స వాలు ఈ నెల 14న ప్రారంభమై 26న ముగియనున్నాయి. 14న అంకురా ర్పణ, 15న ధ్వజారోహణ, కల్యాణో త్సవం, బ్రాహ్మణ సంతర్పణం, 16న బ్రహ్మ రథోత్సవాలను నిర్వహించను న్నారు. 17 నుంచి 23 వరకూ సర్ప సేవా పూజలు, అన్నసంతర్పణ , 22న నెమలి వాహన సేవ , 23 నుంచి 26 వరకు సర్ప సేవ, అన్న సంతర్పణం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాగలమడక జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎండోమెంట్ అధికారి, తహసీల్దార్ డీఎస్ వరదరాజు తెలిపారు.

## గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న పీఆర్ సీఈ సుబ్బారెడ్డి

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహ దారుల అనుసంధాన ప్రాజెక్ట్ కింద చేపట్టిన రహదారుల నిర్మాణాలన్నీ ఏప్రిల్ నెలాఖరు కల్లా పూర్తి చేయాల్సిందేనని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో చేపట్టిన రహదారుల నిర్మాణాలను బుధ, గురువా రాల్లో ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం అనంతపురంలోని పంచాయతీరా జ్‌శాఖ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట ర్లతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ యమ్మాని భాగ్యరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ ఈఈలు కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాస్, క్వాలిటీ కం ట్రోల్ విభాగం ఈఈ మల్లికార్జున మూర్తి, పీఐయూ డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, డీఎల్ మురళీ, హనుమంతశెట్టి, వెంకటేశులు, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## జనవాక్కు

### రూ.1.57 లక్షలకు పైగా లబ్ధి



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధం గా సంక్షేమ పథకాలతో మా కుటుంబానికి రూ. 1,57,670కు పైగా లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫారసులు లేకుండానే మా అర్హతే ప్రామాణికం గా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పథకాలను అం దజేస్తున్నారు. రైతు భరోసా, పంటల బీమా, పింఛన్ కానుక, ఆసరా, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ సున్నా వడ్డీ తదితర పథకాలు వర్తించాయి. సీఎం వైఎస్ జగన్ మేలు ఎన్నటికీ మరిపోలేం.

– కాపు శంకరరెడ్డి, జమ్మానిపల్లి, మడకశిర మండలం

### అప్పులు చేసే పనేలేదు



మాది మధ్య తరగతి కుటుం బం. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. ఇద్దరు ఆడపిల్లలు. భర్త వ్యవసాయ పనులు చేస్తే నేను పాడి ఆవులు చూసుకొని ఉదయం సాయంత్రం పాలు పోసి జీవనం సాగిస్తున్నాం. ఈ తరుణం లో పొదుపు సంఘంలో ఉండటంతో రుణం తీసుకొని రెండు పాడి ఆవులు కొనుగోలు చేశాము. వ్యవసాయ భూమి ఉన్నా పంటలు పెట్టేందుకు కూలీల ఇబ్బందులతో వదిలేశాం. ఈ తరుణంలో రాజీవ్ మహిళా సంఘంలో రుణం తీసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాం. ప్రభుత్వం సైతం ఫీజురీయింబ ర్స్‌మెంట్ ఇస్తోంది. దీంతో బయట అప్పులు చేసే పని లేకుండానే నెట్టు కొస్తున్నాం. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌నే చూడాలని ఉంది.

– అనితమ్మ, మద్దిగిరేపల్లి, హిందూపురం

### మేలు ఎన్నటికీ మరువం



నేను, నా భర్త గోవిందు.. ఇద్దరమూ దివ్యాంగులమే. సాధారణ వ్యక్తుల్లా పని చేయలేని స్థితి మాది. మా పరిస్థితిపై కరుణించి సం క్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలంటూ గత ప్రభు త్వంలో నాయకులను ప్రాధేయపడ్డాం. అయినా ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చిన తర్వాత నాకు, నా భర్తకు ఇద్ద రికీ దివ్యాంగుల కోటా కింద చెరో రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు పింఛన్ అం దుతోంది. దీంతో మా ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. అమ్మ ఒడి పథకం వర్తించ డంతో కుమార్తె చదువులకు ఢోకా లేదు. సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరువం.

– బోయ పార్వతి, కొర్రకోడు, కూడేరు మండలం

### ఆరోగ్యశ్రీతో పునర్జన్మ



నా వయస్సు 67 సంవత్స రాలు. కేబుల్ తవ్వకం పనులు చేసుకుని కుటుం బాన్ని పోషించేవాళ్లం. కానీ ఉన్నట్లుండి తీవ్రమైన నడుం నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించి పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నా. కిడ్నీలో సమస్య ఉందని వైద్యులు చెప్పడంతో 2021లో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చేరాను. ఆపరే షన్‌కు రూ.6,20,000లను ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేసింది. ముసలి వయస్సులో ఎవరూపట్టించుకోకపోయినా నేను న్నానని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. జగన్ నాకు పునర్జన్మ ఇచ్చారు. నా ప్రాణం ఉన్నంత వరకూ జగన్‌కే నా మద్దతు ఇస్తా.

– బళ్లారి ముత్యాలమ్మ, గుమ్మఘట్ట

## నేడు చిలమత్తూరులో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన


వీరాపురంలో మంత్రి పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నాయకులు

చిలమత్తూరు: రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, శెట్టిపల్లి, కోడూరు, కొడికొండ పంచాయ తీలను ఆయన సందర్శిస్తారు. ఇప్పటికే నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి పంచాయతీలో మంత్రి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించను న్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పిలుపునిచ్చారు.

## ఖాద్రీశుడి హుండీ కానుకల లెక్కింపు



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం ఆలయ అధికారులు, కెనరా బ్యాంక్ అధికారులు లెక్కించినట్లు ఆలయ ఈఓ వీ.శ్రీనివా సరెడ్డి తెలిపారు. 41 రోజులకుగాను హుండీలను లెక్కింపు నిర్వహించగా రూ.65,74,179 వచ్చింద న్నారు. గతంలో కంటే ఈ సారి ఆదాయం ఎక్కువ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుం డీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, బ్యాంక్ మేనే జర్, పాలక మండలి సభ్యులు, బ్యాంక్ ,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.